## క్లుప్తంగా

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కాళ్ల: భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు జువ్వలపాలెం గ్రామ సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం పారా లీగల్ వలంటీర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా గ్రామ వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. భూతగాదాలు, మనోవర్తి కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, కొట్లాట తదితర కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. సచివాలయం కార్యదర్శి ఎ.కృష్ణశివరాజు, సచివాలయం సిబ్బంది కోర్టు సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

### జాన్సన్‌కు సత్కారం

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు గ్రామంలో సెయింట్ పాల్ లూథరన్ దేవాలయ పారిస్ సంఘ పెద్దల ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్‌ను గజ మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ క్రిస్టియన్, మైనారిటీలకు సంబంధించి సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం దిశంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పి. ప్రవీణ్, బేతాళ సంతోష్, డెలిగేట్, మాజీ ఉప సర్పంచ్ అల్లూరి వరికుమార్ రాజు, సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి, వర్గీస్ డేనియేలు, మాజీ సర్పంచ్ రాట్నాల సత్యనారాయణ, పి. మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.

### డీఎల్‌పీఓ రెడ్డియ్యకు అవార్డుపై అభినందన

పాలకోడేరు: ఇన్‌చార్జి డీఎల్పీఓ వి.రెడ్డియ్య ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎంపీడీఓ మురళీ గంగాధర రావు అన్నారు. ఉత్తమ ఉద్యోగి అవార్డు పొందిన పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్యను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. రెడ్డియ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు జార్జి ప్రసాద్, పోలయ్య లక్ష్మి, రాజేష్, రమాలీల, వెంకటరాజు, శ్యాం బాబు పాల్గొన్నారు.

### సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు

ఆకివీడు: సూర్యభగవానుడు జన్మదినోత్సవం రథసప్తమిగా భక్తులు అనాదిగా పూజలు చేస్తున్నారని స్థానిక వేంకట లింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్యం చెప్పారు. రథసప్తమి, ఆదిత్యుడి పుట్టిన రోజు సందర్భంగా ఆలయంలో సూర్యభగవానుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి రోజున సూర్యుడ్ని ప్రతి ఆదివారం పూజించడం ద్వారా మంచి ఫలితాలుంటాయని ఆయన చెప్పారు. పూజా కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

### 31 నుంచి కుక్కలకు రేబిస్ టీకాలు

పాలకోడేరు: పాలకోడేరు, విస్సాకోడేరు, మోగల్లు పశు వైద్య కేంద్రాల వద్ద పెంపుడు, వీధి కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా ఈనెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి మౌర్య సత్యేంద్ర చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువైద్య కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వ్యాక్సినేషన్ సమయంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు వీధి కుక్కలను పట్టించి వాటికి వ్యాక్సిన్ వేసేలా సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ మురళీ గంగాధరరావు, పంచాయతీ విస్తరణ అధికారి వి.రెడ్డియ్య పాల్గొన్నారు.

### నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ

వీరవాసరం: తోలేరులోని శ్రీరుద్రేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన శనివారం ఘనంగా జరిగింది. విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనం, పంచశయ్యాదివాసాలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. నవగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భోగిరెడ్డి శ్రీనివాస్ దంపతులు, దాతలు పాల్గొని పూజలు నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం అన్నసమారాధన చేశారు. సుమారు 15 రకాల పిండివంటలతో భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

### 200 రోజులు పని కల్పించాలి

పాలకోడేరు: ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శేషపు అశ్రియ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలకోడేరులో శనివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో యాంత్రీకరణ వల్ల కూలీలకు ఉపాధి కరువైందన్నారు. ఉపాధి పథకంలో కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజు వారి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డి.మరియ, లక్ష్మి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# బడుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరగాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశం
- చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూళ్ల ఆకస్మిక తనిఖీ



చెరుకువాడలో ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులతో మట్లాడుతున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి



చెరుకువాడలో జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విద్యావిధానాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. శనివారం ఉండి మండలం చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారంలోని ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, జిల్లా విద్యాశాఖాధికారులను పలు విషయాలపై ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి విద్యావ్యవస్థకు పోటీగా ట్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చిందని, వాటి వినియోగంపై ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పని సరిగా వినియోగించాలని అన్నారు. ఎంతో ఖరీదైన ట్యాబ్‌లు, వాటిలోని కంటెంట్‌ను వినియోగిస్తే విద్యార్థుల్లో గొప్ప మార్పు వస్తుందని అన్నారు. అలాగే పాఠశాలల్లో నాడు-నేడు అమలు చేయడంతో అద్భుతమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల్లో సదుపాయాలున్నాయన్నారు. అలాగే విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందిస్తున్న విద్య, సదుపాయాల అమలులో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని అన్నారు. విద్యార్థులకు అందించే తాగునీరు స్వచ్ఛంగా ఉండాలన్నారు. అలాగే మరుగుదొడ్ల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వాటి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు ఎక్కడా బహిరంగంగా మరుగుదొడ్లకు వెళ్ళకూడదన్నారు. ముఖ్యంగా పాఠశాల పర్యావరణం ఎప్పుడూ చాలా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి పెద్ద స్కూల్‌కు నైట్‌వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామన్నారు. అలాగే విద్యా బోధన విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. అలాగే జిల్లా ఉన్నతాధికారులు కూడా ప్రతి పాఠశాలను పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ డీ మధుసూదనరావు, డీఈవో ఆర్ వెంకటరమణ, సమగ్ర శిక్ష అభియాన్ సమన్వయకర్త శ్యామ్‌సుందర్, ఎంఈవో ఏ రవీంద్ర, సర్పంచ్ కొండవేటి సాంబశివ రావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డీఎన్నార్‌లో లాలా లజపతిరాయ్ జయంతి



భీమవరం డీఎన్నార్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త లాలా లజపతి రాయ్ జయంతిని శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్యోద్యమం-స్వాతంత్ర్య భారతం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీఎస్ వర్మ, చెరుకువాడ రంగసాయి, రామి సేతు, నెక్కంటి వెంకటరావు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దైవ చింతనతో ఉండాలి



పెదగరువులో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ దైవ చింతనను కలిగియుంటే సమాజాభివృద్ధితో పాటుగా సమాజంలో శాంతి నెలకొంటుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని పెదగరువు గ్రామంలో శనివారం శ్రీ కోదండ రామాలయం ప్రథమ వార్షిక మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాలయాల వద్ద ఇలాంటి పుణ్య కార్యక్రమాలు, హోమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు దైవానుగ్రహం ఉంటుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సమస్యలు పరిష్కరిస్తూ పాలన సాగిస్తున్నారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శ్రీ కోదండ రామస్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముందుగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంట తోట భోగయ్య, ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వర రావు, గొట్టుముక్కల పద్మరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కొట్టి కుటుంబరావు, ఆరేటి పెద్దబ్బు తదితరులు ఉన్నారు.

**శాంతి కల్యాణంలో పాల్గొన్న ఎంపీపీ పేరిచర్ల దంపతులు**

ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, సుహాసిని దంపతులు పాల్గొని శాస్త్రోక్తంగా గోపూజ, విఘ్నేశ్వర పూజ, పంచకర్మ ప్రాసనం, రక్షా బంధనం, అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన, అగ్ని మధనం, పూర్ణాహుతి, శాంతి కళ్యాణంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వివిధ వంటకాలతో సుమారు 3 వేల మంది భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

## పీవీఎల్‌కు శుభాకాంక్షలు తెలిపిన పేర్ని నాని



పీవీఎల్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పేర్ని నాని

కాళ్ల: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు మాజీ మంత్రి పేర్ని నాని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం భీమవరంలోని ఒక ప్రైవేట్ కార్యక్రమనికి విచ్చేసిన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)ని పీవీఎల్ నర్సింహరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవీఎల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవెయ్యాలని ఆకాంక్షించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు సేవ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. వీరి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

**చిన్నారులకు భోజనాలు**

కాళ్ల: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పుట్టిన రోజును పురస్కరించుకుని బాలల సంరక్షణ కేంద్రంలో చిన్నారులకు భోజనాలు ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు ఓ అభిమాని. చినఅమిరం గ్రామంలోని ఇమ్మనియేల్ చిల్డ్రన్స్ హోమ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ కిషోర్ ఆధ్వర్యంలో శనివారం చిల్డ్రన్ హోమ్‌లో పిల్లలందరికీ భోజనాలు అందించారు. దేవుడు, ఉండి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ పీవీఎల్‌కు ఉండాలని, మంచి ఆరోగ్యంతో ప్రజలకు మరింత సేవలందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## రోప్ స్కిప్పింగ్ పోటీల ప్రారంభం

సాక్షి, భీమవరం: రాష్ట్ర అంతర్ జిల్లాల 66వ స్కూల్ గేమ్స్ అండర్ 14 అండర్ 17 అండర్ 19 బాలబాలికల రోప్ స్కిప్పింగ్ టోర్నమెంట్, సెలెక్షన్స్ శనివారం బ్రౌనింగ్ జూనియర్ కాలేజిలో శనివారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ మేడిది జాన్సన్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కర్రి కృష్ణారెడి, సెక్రటరీ ఎండీ కుద్దూస్, కళాశాల ప్రిన్సిపాల్ రంప ఎలీషా రంప, చీఫ్‌కోచ్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి, జానపద నృత్యాలు



నృత్యాలు చేస్తున్న కళాకారులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో శనివారం ఏర్పాటు చేసిన కూచిపూడి, జానపదనృత్యాలు ఆకట్టుకున్నాయి. శనివారం సాయంత్రం శ్రీనివాస కూచిపూడి నృత్యనికేతన్ భీమవరం వారితో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, అలాగే శ్రీనాట్య నిలయం కూచిపూడి డ్యాన్స్ అకాడమి భీమవరం వారితో నిర్వహించిన కూచిపూడి జానపద నృత్యాలు అకట్టుకున్నాయి. రాత్రి 8 గంటలకు హైదరాబాద్ శ్రీకృష్ణ స్వరాగ స్రవంతి ఆధ్వర్యంలో సినీ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను అలరించింది.

**నేటి ప్రత్యేకతలు ఇవే**

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు భరత నాట్యం 7 గంటలకు సినీ నటుడు జేడీ చక్రవర్తికి సువర్ణ హస్తాకంకణంతో ఘన సన్మానం, రాత్రి 8 గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వహికులు తెలిపారు.

## 31న భీమవరానికి ప్రత్యేక హోదా సమరయాత్ర



భీమవరంలో ప్రత్యేక హోదా సమర యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సమరయాత్ర ఈనెల 31న భీమవరం చేరుకుంటుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు చెప్పారు. శనివారం పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమరయాత్ర భీమవరం చేరుకుంటున్న సందర్భంగా పట్టణంలో విద్యార్థులు, యువకులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు జిల్లా ప్రజలు, మేధావులు, యువకులు హాజరై రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తూ యువకులకు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని, ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సాధన సమితి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సుందర్, యు.వినోద్, బి.గణేష్, పి.మోహిని లక్ష్మి, శ్రీను, మహర్షి పాల్గొన్నారు.

## 30న చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సు



భీమవరంలో చేతివృత్తిదారుల రౌండ్‌టేబుల్ సమావేశం దృశ్యం

సాక్షి, భీమవరం: విజయవాడలో ఈనెల 30న నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సులో విజయవంతం చేయాలని వృత్తిదారుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో చేతి వృత్తిదారుల సంఘ సమావేశం రేవు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా రౌండ్‌టేబుల్ సమావేశంలో వృత్తి సంఘాల నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి, పిచుక ఆదిశేషు, జల్లి మోహనరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతోకాలంగా ఉన్న చేతి వృత్తులను ఆదుకోకపోగా ప్రపంచీకరణ విధానాలు అమలు చేస్తూ వృత్తులను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. సోమవారం విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందింస్తామన్నారు. సమావేశంలో బొబ్బనపల్లి సూర్య చంద్రరావు, కిలాడి సత్యనారాయణ, రాజాన శివప్రసాద్, పాలకోడేటి లక్ష్మణరావు, జుత్తిగ శ్రీనివాస్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


## జగన్ ప్రభుత్వంలో ప్రజారోగ్యం పదిలం



ఉండిలో రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న ప్రతి నిర్ణయంతో ప్రజారోగ్యం రాష్ట్రంలో పదిలంగా ఉందని ఎంపీపీ, ఉండి పీహెచ్‌సీ చైర్మన్ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శనివారం ఉండి రెండవ సచివాలయ పరిధిలోని ఆర్అండ్‌బీ భవనం వద్ద 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులు, ,రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రాష్ట్రంలోని పేదలకు ఖరీదైన వైద్యాన్ని సీఎం వైఎస్ జగన్ అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. అలాగే రూ.వెయ్యి దాటిన రోగులకు ఆరోగ్యశ్రీ వర్తించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంతో మందికి మేలు జరుగుతోందన్నారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రతి కుటుంబం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా డాక్టర్ ఇంటికి వచ్చి రోగులను పరీక్షించడం చాలా గొప్ప విషయమని అన్నారు. అలాగే అనారోగ్యంతో ఉన్నవారంతా ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి పి ధర్మతేజ్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ మణి

సాక్షి, భీమవరం: మహిళలకు వైద్య సహాయం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని విజయవాడ అక్కినేని ఉమెన్స్ హాస్పటల్ అధినేత డాక్టర్ అక్కినేని మణి చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఉన్నత భారత్ అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. తమ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లో పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది మహిళలకు వైద్య సహాయం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ఆర్ అండ్ డీన్ డాక్టర్ పీఏ రామకృష్ణంరాజు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ డాక్టర్ పి.భువనేశ్వరి, హాస్పటల్ సీఈవో పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాళింగగూడెంలో అమ్మవార్ల జాతర

ఆకివీడు: కొల్లేటి కోట తీరంలో ఉన్న కాళింగగూడెం గ్రామంలోని గంగానమ్మ, పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం చెప్పారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు, మహిళలు బండారు (పసుపు) కలిపిన నీళ్ల బిందెలతో ప్రదర్శనగా గ్రామానికి రెండు వైపులా శివారు ప్రాంతాల్లో ఉన్న గంగానమ్మ, పెద్దింటి అమ్మవారికి జలాభిషేకాలు చేస్తారు. అమ్మవారి ముగ్గులను బొడ్డుపల్లి అప్పనపల్లి రూ.71 వేలకు పాడుకున్నారు. అమ్మవారికి ముందుగా నైవేద్యాలు, మొక్కులను తీర్చుకున్న తరువాత గ్రామంలోని మహిళలు జలాభిషేకం చేస్తారు. గత 40 ఏళ్లగా అమ్మవారి జాతరను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దర్శించుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

## చెత్తకు నిప్పుతో ఆందోళన

సాక్షి, భీమవరం: పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో శనివారం చెత్తకు నిప్పంటుకోవడంతో దట్టమైన పొగ వ్యాపించి ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## అవగాహన లేని పాదయాత్ర ఎందుకు?



బందన పూర్ణచంద్రరావు

భీమవరం అర్బన్: ప్రజా సమస్యలపై కనీస అవగాహన లేని నారా లోకేష్ పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని అగ్ని, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజా సమస్యలపై చర్చా వేదికలంటూ మహిళలను యువతను తీవ్రంగా అవమాన పరుస్తున్నారంటూ మండిపడ్డారు. కుప్పం నియోజకవర్గంలో చర్చా వేదిక పేరుతో వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వనితను విమర్శించడం ఆమెను తీవ్రంగా అవమానించడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఒక మహిళ అని చూడకుండా అసభ్య పదజాలంతో విమర్శించడం ఎంత వరకూ న్యాయమని ప్రశ్నించారు. మత్స్యకార మహిళ అనే విజ్ఞత కూడా లేకుండా ఆరోపణలు చేసిన లోకేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే మత్స్యకారులంతా లోకేష్ పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా రథసప్తమి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

భీమవరం(ప్రకాశం చౌక్): రథసప్తమి పురస్కరించుకుని భీమవరం పట్టణంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జువ్వలపాలెం రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రథసప్తమి సందర్భంగా స్వామి వారికి సుర్య ప్రభ పై సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రుద్రరాజు గంగాశ్రీదేవి, దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. పంచారామక్షేత్రంలో కొలువైన శ్రీ సూర్యభాగవానుడికి రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.